RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్ దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 48 | జనవరి 25, 2026 | వెల : రూ.3-00




విద్యతోనే బాలికలకు బంగారు భవిష్యత్

4లో..

- కలవరపెడుతున్న 'సిట్' దర్యాప్తు
- నెక్స్ట్ ఎవరికి నోటీసులు వస్తాయోనని టెన్షన్
- ఏం జరుగుతుందోనని వెంటాడుతున్న ఆందోళన
- పైకి మాత్రం గంభీరంగానే మాటలు
- తలనొప్పిగా మారిన 'కవిత వ్యాఖ్యల' ఎపిసోడ్
- రాజకీయంగా కాంగ్రెస్ పార్టీ ముప్పేట దాడి
- టికెట్ల కోసం గులాబీ పార్టీలో తీవ్ర పోటీ
- దక్కకపోతే పక్క పార్టీలోకి వెళ్లే చాన్స్
- పురపోరుపై 'ఫోకస్' తగ్గుతోందంటూ నేతల వ్యాఖ్యలు

# బీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరి!

మున్సిపల్ ఎన్నికల వేళ కారు పార్టీకి తలనొప్పులు



**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో:**

మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటి పూర్వ వైభవం తెచ్చుకోవాలని బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం భావిస్తుంటే, క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. ఒకవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తు వేగం పెరగడం.., మరోవైపు కవిత ఎపిసోడ్‌తో పార్టీలోనే అంతర్గత కలకలం, ఇంకోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి వరుస ఎదురుదాడులు.. మధ్యలో టికెట్ల లొల్లి, పక్క పార్టీ వైపు చూస్తున్న ద్వితీయ శ్రేణి నాయకత్వం.. వెరసి కారు పార్టీ ముప్పేట దాడితో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. మొత్తంగా చూస్తే, మున్సిపల్ ఎన్నికల ప్రచారంపై ఫోకస్ చేయలేని స్థితిలో బీఆర్ఎస్ ఉన్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**– కలవరపెడుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు..**

ఫోన్ ట్యాపింగ్ కేసు ఇప్పుడు బీఆర్ఎస్‌కు అతిపెద్ద రాజకీయ తలనొప్పిగా మారింది. ఈ కేసులో ఇప్పటికే మాజీ మంత్రి హరీశ్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిట్ ఎదుట హాజరయ్యారు. నెక్స్ట్ దశలో సంతోష్, కేసీఆర్ కు కూడా నోటీసులు రావచ్చన్న ప్రచారం పార్టీ వర్గాల్లో కలవరం రేపుతోంది. అయితే బయటికి నేతలు ధైర్యంగా మాట్లాడుతున్నప్పటికీ, ఎప్పుడు ఎవరికీ నోటీసు వస్తుందో.. ఏ కొత్త అంశం బయటపడుతుందో.. అనే ఆందోళన లోపల తీవ్రంగా ఉందని పార్టీ వర్గాలే అంగీకరిస్తున్నాయి. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికల సమయంలో ఈ విచారణలు కొనసాగడం వల్ల, ప్రచారం కంటే న్యాయ, రాజకీయ రక్షణకే ఎక్కువ సమయం ఖర్చు చేయాల్సి వస్తోందన్నది బీఆర్ఎస్ సమస్యగా మారింది.

**– తలనొప్పిగా కవిత ఎపిసోడ్**

ఇదే సమయంలో కేసీఆర్ తనయ కవిత బీఆర్ఎస్ నుంచి బయటకు రావడం, తర్వాత పార్టీ పెద్దలపై వరుసగా ఘాటైన వ్యాఖ్యలు చేయడం బీఆర్ఎస్‌కు మరింత తలనొప్పిగా మారింది. మొన్నటి దాకా హరీశ్ రావు, సంతోష్ పైనే వ్యాఖ్యలు చేసిన కవిత తాజాగా కేటీఆర్‌పై కూడా విమర్శలు చేస్తూ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో భారీ అవినీతి జరిగింది అంటూ పార్టీపైనే ఆరోపణలు చేయడం రాజకీయంగా సంచలనంగా మారింది. ఈ వ్యాఖ్యలపై ఇప్పటివరకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు బహిరంగంగా స్పందించకపోవడంతో, కవిత వ్యాఖ్యలు ప్రతిపక్షాలకు బలమైన రాజకీయ ఆయుధంగా మారుతున్నాయి. మరోవైపు పార్టీ కేడర్‌లోకి కూడా.. నిజమేనా? అనే రాంగ్ ఇన్ఫర్మేషన్ వెళ్తోందని, ఇది పార్టీకి అంతర్గతంగా మరింత నష్టం చేస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు.

**– కాంగ్రెస్ ముప్పేట ఎదురుదాడి..**

ఈ పరిణామాలన్నిటికీ తోడు, కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి వస్తున్న వరుస రాజకీయ ఎదురుదాడులు బీఆర్ఎస్‌పై ఒత్తిడిని పెంచుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ గద్దెలు కూలాలి అంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయాల్లో పెద్ద దుమారం రేపాయి. కాంగ్రెస్ మంత్రులు కూడా బీఆర్ఎస్‌ను పూర్తిగా రాజకీయంగా తుడిచిపెట్టాలి అన్న తరహా వ్యాఖ్యలు చేస్తుండటంతో రెండు పార్టీల మధ్య రాజకీయ యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాలుస్తోంది. ఈ పరిస్థితుల్లో మున్సిపల్ ఎన్నికలు కేవలం స్థానిక సంస్థల ఎన్నికలు కాకుండా, కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య తొలి పెద్ద రాజకీయ పోరాటంగా మారుతున్నాయి.

**– టికెట్ల గందరగోళం..**

మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ల పంపకం పార్టీ అంతర్గతంగా మరో పెద్ద సమస్య మారింది. మున్సిపల్ ఎన్నికల్లో ఆశావహులు భారీగా ఉండటంతో, పాత నాయకులకు కాకుండా డబ్బు ఖర్చు పెట్టే వారికే టికెట్లు ఇస్తున్నారు అనే ప్రచారం పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తిని రేపుతోంది. టికెట్ దక్కదని కన్ఫామ్ అయిన ద్వితీయశ్రేణి నాయకులు, వారి అనుచరులు పక్క పార్టీలోకి వెళ్తాం అంటూ బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేయడం పార్టీ పెద్దలకు మరో పెద్ద తలనొప్పిగా మారింది. గ్రామస్థాయి నుంచి పట్టణస్థాయి వరకు కేడర్‌లో అసంతృప్తి పెరుగుతోందన్నది బీఆర్ఎస్‌కు ప్రమాద సంకేతంగా కనిపిస్తోంది.

**– పురపోరుపై ఫోకస్ తగ్గుతోందా?**

కాగా, ఇన్ని రాజకీయ తుఫాన్ల మధ్య బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఎన్నికలపై పూర్తి స్థాయిలో ఫోకస్ చేయలేకపోతున్నట్లు పార్టీ వర్గాలే అంగీకరిస్తున్నాయి. ఒకవేళ మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోతే, దాని ప్రభావం పార్టీపై దీర్ఘకాలంగా పడే అవకాశం ఉందని పార్టీలోనే టాక్ నడుస్తోంది. ద్వితీయస్థాయి, గ్రామస్థాయి నాయకులు పెద్ద ఎత్తున పార్టీకి దూరమయ్యే ప్రమాదం ఉందని, ఇది భవిష్యత్ రాజకీయాల్లో బీఆర్ఎస్‌ను మరింత బలహీనపరిచే అవకాశముందని విశ్లేషిస్తున్నారు.

# టీ హబ్ స్టార్టప్‌లకే అంకితం

- ఇంక్యుబేషన్, ఇన్నోవేషన్‌కు భంగం కలగనివ్వొద్దు
- అద్దె కార్యాలయాల తరలింపుపై సీఎం స్పష్టత



File Photo

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

టీ హబ్‌ను పూర్తిగా స్టార్టప్‌ల కేంద్రంగానే కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను టీ హబ్‌కు మార్చుతున్నట్లు వస్తున్న వార్తలపై సీఎం వెంటనే స్పందించారు. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాలను అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాలకు మార్చాలని స్పష్టంగా సూచించారు. స్టార్టప్‌లకు ఇంక్యుబేటర్‌గా, ఇన్నోవేషన్ క్యాటలిస్ట్‌గా ఏర్పాటు చేసిన టీ–హబ్‌లో ఇతర ప్రభుత్వ కార్యాలయాలు ఉండకూడదని సీఎం తేల్చిచెప్పారు. టీ హబ్ ప్రత్యేకత, లక్ష్యం దెబ్బతినేలా ఎలాంటి మార్పులు చేయరాదని, అలాంటి ఆలోచనలు ఉంటే వెంటనే విరమించుకోవాలని ఆదేశించారు. ప్రపంచ స్థాయిలో స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయాలన్న ప్రభుత్వ దృష్టికోణానికి టీ హబ్ కీలకమని సీఎం పేర్కొన్నారు. స్టార్టప్‌ల వృద్ధి, ఆవిష్కరణలకు అనుకూల వాతావరణం కొనసాగించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

# రోజ్గార్ మేళాతో పారదర్శక నియామకాలు

- మోదీ నేతృత్వంలో 11 లక్షల ఉద్యోగాలు
- హకీంపేటలో నియామక పత్రాల పంపిణీ
- నిరుద్యోగంపై గట్టి పరిష్కారమే లక్ష్యం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

కేంద్ర ప్రభుత్వ నియామకాల్లో పారదర్శకత, అవినీతి రహిత విధానాలకు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం రోజ్గార్ మేళా ద్వారా పదకొండు లక్షలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసిందని తెలిపారు. శుక్రవారం దేశవ్యాప్తంగా

మిగతా 3వ పేజీలో..

# మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పోటీ

- నిబద్ధత గల యువతకే టికెట్లు
- ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ మిరియాల రామకృష్ణ

3లో..



# హమారా అడ్డా @ రాజేష్ హోటల్

- అందరికీ చర్చకు ఫేవరెట్ స్పాట్‌గా 'రాజేశ్ స్వీట్ హౌస్'
- సమాచారం తెలియాలంటే ఇక్కడికి రావాల్సిందే..!
- చక్కగా ఛాయ్ తాగుతూ కబుర్లు, చర్చలకు వేదిక ఇది..




**వేద న్యూస్ వరంగల్ ప్రతినిధి:**

ప్రస్తుత ఉరుకుల పరుగుల డిజిటల్ ప్రపంచంలో..ఏదైనా విషయమై చర్చ, అభిప్రాయాలపై డిస్కషన్, సమాచార సేకరణ అనేది అత్యంత కీలకం. కాగా, గ్రేటర్ వరంగల్ ప్రజానీకానికి ఈ ప్రదేశం ఫేవరెట్ డిస్కషన్ అడ్డాగా కొనసాగుతుండటం విశేషం. వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని అండర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న రాజేష్ స్వీట్ హౌస్ నగరవాసులకు చక్కటి చర్చావేదికగా కొనసాగుతోంది. వరంగల్ నగర పరిధిలోని పోలీసులు, జర్నలిస్టులు, పొలిటీషియన్స్, కూలీలతో పాటు కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు అందరూ..ఇక్కడికి వచ్చి చర్చలు నిత్యం కొనసాగిస్తుంటారు.

**హమారా అడ్డా..**

రాజేశ్ స్వీట్ హౌస్ 'హమారా అడ్డా..' అన్నట్టుగా చాలా మందికి.. ఇక్కడికి రాకపోతే పొద్దుపోదు అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. కొంత మంది అయితే ఎన్ని పనులున్నా వాటిని ముగించుకుని మరీ ఇక్కడికి వచ్చి.. ఛాయ్ తాగి ముచ్చట్లు కొనసాగిస్తూ తమ చర్చలను ఈ ప్రదేశంలో జరుపుతుంటారు. ఇక్కడికి రాకపోతే తమకు గ్రేటర్ వరంగల్ నగరానికి సంబంధించినది అయినా లేదా వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలో ఏం జరుగుతున్నదనే సమాచారం తెలియదని కొందరు జర్నలిస్టులు పేర్కొంటున్నారు. తాము సమాచార సేకరణకు నిత్యం ఈ స్వీట్ హౌస్ వద్దకు వస్తామని, ఛాయ్ తాగి చక్కగా కబుర్లు చెప్పుకుంటూ.. ముచ్చట్లతో కాలక్షేపం చేస్తూనే.. ముఖ్యమైన సమాచారాన్నీ సేకరిస్తుంటామని అంటున్నారు. ఈ ప్రదేశానికి రావడం ద్వారా తాము తూర్పు పరిధిలోని కీలకమైన నేతలు, అధికారుల అభిప్రాయాలనూ సులభంగా సేకరించగలుగుతామని, తమ పరిచయాలు మరింత విస్తృతమయ్యాయనీ వెల్లడించారు. మొత్తంగా 'రాజేశ్ స్వీట్ హౌస్ ..' అనేది తమకు ప్రజలకు 'సమాచార భవన్' మాదిరిగా ఎంతో సమాచారాన్ని అందిస్తోందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని పలువురు పేర్కొన్నారు.

# సర్కారు కర్షకుల పక్షం వహించాలి

- రైతు భరోసాపై స్పష్టత ఏది?
- ప్రభుత్వం వెంటనే కార్యాచరణ ప్రకటించాలి
- తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

రైతు భరోసాపై స్పష్టత ఏది? అని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే కార్యాచరణ ప్రకటించాలనీ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో టీఆర్ఆర్ఎస్ నేతలతో కలిసి మాట్లాడుతూ..సర్కారు కర్షకుల పక్షం వహించాలన్నారు. ఎన్నికలకు ముందు ఎలాంటి షరతులు లేకుండా ప్రతి రైతుకు ప్రతి ఎకరాకు సంవత్సరానికి రూ. 15,000 చొప్పున రైతు భరోసా అందిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు పథకం అమలుపై స్పష్టత ఇవ్వకపోవడం వల్ల రాష్ట్ర రైతుల్లో అయోమయం నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా రూపొందించిన రైతు భరోసా పథకాన్ని క్రమబద్ధంగా, పారదర్శకంగా అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. ప్రతి పంటకాలంలో రైతులకు భరోసాగా నిలవాల్సిన ఈ పథకం విషయంలో స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం వల్ల ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్న విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల కంటే మెరుగైన పాలన, రైతులకు మరింత మేలు జరుగుతుందన్న ఆశతో.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ను నమ్మి ప్రజలు అధికారంలో కి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సి న బాధ్యత ప్రభుత్వంపై ఉంద న్నారు. రైతుల ఆశలు, విశ్వాసాలు దెబ్బతినకుండా చూడాలంటే రైతు భరోసా పథకం అమలుపై తక్షణమే స్పష్టమైన నిర్ణయాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతు బరోసా పథకం కింద ప్రతి సంవత్సరం ఏ తేదీ వరకు, ఎంత మొత్తాన్ని, ఏ విధంగా రైతులకు అందించనున్నారో ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించి, రైతులు అయోమయానికి గురికాకుండా చూడాలని రాష్ట్ర రైతులు వినయపూర్వకంగా బలంగా కోరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో రైతు రక్షణ సమితి నాయకులు హింగే రవీందర్, అంబీరు శ్రీనివాస్, కే మాధవరావు, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.



# అందరి ఆత్మబంధువు రాసమల్ల భాగ్య శేఖర్

- 24 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో ..
- 24 గంటలు ఉచిత అంబులెన్స్ సేవలకు హామీ


**వేద న్యూస్, జమ్మికుంట:**



రాసమల్ల శేఖర్.. అలియాస్ 'అంబులెన్స్ శేఖర్' గా జమ్మికుంట పట్టణ పరిధిలో జనం అందరికీ సుపరిచితమైన వ్యక్తి అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో జమ్మికుంట నుంచి వరంగల్, కరీంనగర్ వంటి నగరాలకు పేషెంట్లను మెరుగైన వైద్యం కోసం తరలించే క్రమంలో.. పేద, మధ్యతరగతి ప్రజలకు అంబులెన్స్ ఛార్జీలను తక్కువలో చూసే తీసుకునే మనస్తత్వం శేఖర్ ది అని పలువురు అభిప్రాయపడుతున్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలలో శేఖర్ సతీమణి భాగ్య జమ్మికుంట పట్టణ పరిధిలోని 24 వ వార్డులో నుంచి బరిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో సేవా దృక్పథం కలిగిన భాగ్య శేఖర్ ను కౌన్సిలర్ గా చక్కటి సేవలను అందిస్తారని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ముందస్తుగానే ఎన్నికల ప్రచారం ప్రారంభించిన భాగ్య శేఖర్ విజయంపై వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**ప్రచారంలో..జనంతో మమేకమవుతూ..**

24 వ వార్డులో రాస మల్ల భాగ్య శేఖర్ కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో నిలుచుని.. ముందస్తుగానే ప్రచార పర్వంలో దూసుకు వెళ్తున్నారు. గడపగడపకు తిరుగుతూ ... ప్రజలందరి విశ్వా సం చూరగొంటూ.. ముందుకు సాగుతున్నారు . తన భర్త రాస మల్ల శేఖర్ కరోనా కష్టకాలంలో తన అంబులెన్స్ ద్వారా సేవల ను ప్రజల కు విస్తృతంగా అందిం చారని భాగ్య వివరిస్తున్నారు.అనాథ శవాల ను సైతం తన అంబులెన్స్ ద్వారా తరలించి అంత్యక్రియలు నిర్వహించి అందరికీ ఆదర్శం గా శేఖర్ నిలిచారని., నిరుపేద కుటుంబంలో పుట్టినప్పటికీ పేద ప్రజలపై మమకారంతో తను సంపాదించిన దానిలో కొంత భాగం సేవ చేస్తూ..సర్వ్ పీపుల్స్ స్వచ్ఛంద సంస్థ ద్వారా చక్కటి సేవలను శేఖర్ అంది స్తున్నారని చెబుతూ...24వ వార్డు ప్రజలకు 24 గంటలు ఉచిత అంబులెన్స్ సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు.



24వ వార్డు ప్రజల ఆశీర్వాదంతో కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో ఉంటున్నానని, తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే ఇలాంటి సేవా కార్యక్రమాలతో పాటు వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని రాస మల్ల భాగ్య శేఖర్ దంపతులు వెల్లడిస్తున్నారు. ఒకసారి అవకాశం ఇచ్చి గెలిపిస్తే నాయకురాలిగా కాకుండా సేవకులుగా తాము చిత్తశుద్ధితో పనిచేస్తామని., ప్రజలకు స్పష్టం చేస్తూ.. వినమ్ర పూర్వకంగా ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

# గురువు ఆశీస్సులతో ప్రజాసేవ బాటలోకి అరికిల్ల స్రవంతి

**వేద న్యూస్, జమ్మికుంట:**


తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం శిష్యురాలు అరికిల్ల స్రవంతి తన రాజకీయ ప్రయాణంలో మరో కీలక అడుగు వేశారు. జమ్మికుంట మున్సిపాలిటీ 24వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో తన రాజకీయ గురువు ప్రొఫెసర్ కోదండరాంను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. జనసమితి పార్టీ ఆవిర్భావం నుంచే స్రవంతి పార్టీకి వెన్నెముకలా నిలిచిందని అన్నారు. కార్యకర్త స్థాయి నుంచి ప్రారంభమైన ఆమె ప్రయాణం జిల్లా, రాష్ట్ర స్థాయిలో అనేక ఉద్యమాల్లో పాల్గొంటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగిందని ప్రశంసించారు. ప్రజా సమస్యలపై నిబద్ధత, పోరాట స్ఫూర్తి, ఉద్యమ అనుభవమే ఆమె బలం అని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో స్రవంతి కౌన్సిలర్‌గా గెలిచి ప్రజలకు మరింత దగ్గరగా సేవలందించాలని ఆకాంక్షించారు. ఆమె రాజకీయ జీవితంలో ఇంకా ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని గురువుగా హృదయపూర్వకంగా దీవించారు. గురువు ఆశీస్సులు, జమ్మికుంట 24 వ వార్డు ప్రజల ఆశీర్వాదం తో స్రవంతి ప్రజాసేవ బాటలో ధైర్యంగా ముందుకు సాగుతున్నారు.




# మంత్రికి సమ్మక్క సారలమ్మ జాతర కు ఆహ్వానం

**వేద న్యూస్, వీణవంక:**

వీణవంక మినీ మేడారం సమ్మక్క- సారలమ్మ జాతర రెండు సంవత్సరాలకు ఒకసారి పాడి రామకృష్ణా రెడ్డి, పాడి ఉదయ్ నందన్ రెడ్డి ఆధ్వర్యంలో సమ్మక్క సారలమ్మ జాతరను వీణవంక గ్రామంలో ఘనంగా జరుపుతున్నారు. ఈ 2026 వ సంవత్సరంలో జరగబోయే వీణవంక మినీ మేడారం సమ్మక్క- సారలమ్మ జాతర 50వ సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్న సందర్భంగా ఈ నెల 28 నుంచి ప్రారంభమవుతున్న ఆధ్యాత్మిక వేడుక, వీణవంక మినీ మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహాజాతరలో పాల్గొనాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి.. ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు.



- పత్రిక అందజేత

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన సర్పంచ్

**వేద న్యూస్, ముస్తాబాద్:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులైన చెక్కపెల్లి రామకృష్ణకు రూ. 60వేలు, మర్రిపెల్లి లక్ష్మికి రూ. 25వేలు, మర్రిపెల్లి మధుకు రూ. 22వేలు, మాచర్ల రాఖేష్‌కు రూ. 30వేల చొప్పున మొత్తం రూ. 1,27,000 విలువైన చెక్కులను ఈ రోజు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ-శ్రీనివాస్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అన్నమేని రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్దిగారి శ్రీనివాస్, తోట ధర్మేందర్, మామిండ్ల ఆంజనేయులు, యూత్ కాంగ్రెస్ నాయకులు కేసుగాని చంద్రమౌళి, రమేష్ రావు, వెంకటేష్, హరిబాబు, శ్రీనివాస్, దేవయ్యతో పాటు గ్రామ కుల ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేద, అవసరమైన కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని తెలిపారు.



# కొండగట్టు దేవస్థానానికి ఎలక్ట్రికల్ వాహనం అందజేత

**వేద న్యూస్, మల్యాల :**

మల్యాల మండలం కొండగట్టు దేవస్థానం లో వెన్నా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యజమానులు ఎలక్ట్రికల్ వాహనాన్ని శనివారం కొండగట్టు దేవస్థానానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వెన్నా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రతినిధులు పి. రామదేవ్ రావు, పి.లక్ష్మణ్ రావు, వెంకటేశ్వర రావు, గంగారెడ్డి, భరత్, అనిల్, ఈవో శ్రీకాంత్ రావు, సర్పంచ్ దారం ఆది రెడ్డి,ఉప సర్పంచ్ ముత్యం రెడ్డి, అర్చకులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మేడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా ఓటర్ల దినోత్సవం

**వేద న్యూస్, మెట్‌పల్లి:**

నేటి బాలలే రేపటి పౌరులని, రేపటి ఓటర్లు మీరేనని విద్యార్థుల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా మేడిపల్లి (పడమర) జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించి, వ్యాసరచన పోటీ, ఉపన్యాస పోటీలను నిర్వహించి ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సిహెచ్. నాగమణి, ఉపాధ్యాయులు శ్రీదేవి, పద్మలత, నాగన్న, జ్యోతి, సొప్పరి శ్రీనివాస్, భీమన్న, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




# అంగన్వాడీ సెంటర్‌లో జాతీయ బాలికల దినోత్సవం

**వేద న్యూస్, టేక్మాల్:**

ఆడపిల్ల ఇంటికి దీపం, సమాజానికి వెలుగు, దేశానికి చుక్కాని అంటూ బాలికల ప్రాముఖ్యతను కొనియాడుతూ బొడ్మట్‌పల్లి గ్రామ అంగన్వాడీ సెంటర్‌లో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ తలారి అవినాష్ కుమార్ మాట్లాడుతూ, బాలికల బంగారు భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీ టీచర్ దీపిక మాట్లాడుతూ, బేటి బచావో - బేటి పడావో, కిశోర వికాసం, కేజీబీవీ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల ద్వారా బాలికల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు లక్ష్మి, దీపిక, హెల్పర్ గడ్డం అమల, గ్రామస్తులు, చిన్నారులు పాల్గొన్నారు.



# అంగన్వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు

**వేద న్యూస్, టేక్మాల్:**

మెదక్ జిల్లా టేక్మాల్ మండలం సూరంపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శనివారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మైలారం పోచయ్య మాట్లాడుతూ, కిషోర బాలికలకు బాలికల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, గర్భిణులకు పండ్లు, పూలు అందజేసి ఆశీర్వదించారు. మహిళలు, శిశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్యలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అరవింద్, ఎంఎల్‌హెచ్‌పి పృథ్వి, అంగన్వాడీ టీచర్ అనురాధ, వెలుగు సంఘం సభ్యులు సత్తమ్మ, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య ఘర్షణ

**వేద న్యూస్, కారేపల్లి:**

కారేపల్లి మండల పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడం కలకలం రేపింది. శుక్రవారం సాయంత్రం ఉపాధ్యాయులు విద్యార్థులను చితకబాదిన ఘటనపై పదో తరగతి విద్యార్థి ఒకరు సెల్‌ఫోన్ ద్వారా మీడియాకు సమాచారం అందించాడు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపడితే పూర్తి విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని సమాచారం. సంఘటనపై వివరణ కోసం ఉపాధ్యాయులను ఫోన్‌లో సంప్రదించగా స్పందన రాలేదని తెలిసింది.

# బంజరు పల్లె మేడారం మహా జాతర పోస్టర్ ఆవిష్కరణ

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



జనవరి 28 నుండి 31 వరకు జరుగు శ్రీ సమ్మక్క-సారలమ్మ మేడారం మహా జాతరకు సంబంధించిన పోస్టర్లను గ్రామ సర్పంచ్ భూక్య రమేష్, ఉప సర్పంచ్ ఎర్ర సుజాత, జనగాం వెంకటేశ్వర్లు విక్రమ్ రాజ్ కుమార్ స్వామి అనిల్, శివ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. జాతరకు ప్రతి గ్రామం నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు.

# చేనేత ఐక్యవేదిక అధ్యక్షులుగా కస్తూరి లక్ష్మి నారాయణ

**వేద న్యూస్, మల్యాల:**



మల్యాల మండలం తాటిపల్లి గ్రామ వాసి కస్తూరి లక్ష్మీనారాయణని మల్యాల మండల అధ్యక్షులుగా నియమిస్తూ నియామక పత్రాన్ని తెలంగాణ చేనేత ఐక్యవేదిక క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు గాజుల గంగ మల్లేశం శనివారం అందజేశారు. ఈ నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షులు సిరిసిల్ల సురేష్, చేనేత ఐక్య వేదిక యూత్ కార్యదర్శి గాజుల మల్లేశంకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలంధర్ పాల్గొన్నారు.

# ఘనంగా ఎంపీ వద్దిరాజు జన్మదిన వేడుకలు

– అన్నదానలు, ప్రత్యేక పూజలతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన వీఆర్సీ యూత్ సభ్యులు

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పుట్టినరోజు పురస్కరించుకొని వరంగల్ తూర్పు పోచమ్మమైదాన్ జంక్షన్ లో వి ఆర్ సి యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి సుమారు 300 మందికి పండ్లు మరియు అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వద్దిరాజు రవిచంద్ర వ్యక్తిగత సహాయకులు వీణవంక కిరణ్ కుమార్, విఆర్సి యూత్ సభ్యులు ఏరుకొండ వినయ్, ఎండి షారుక్ ఖాన్, సిరిమల్లె కిరణ్, నానవరపు సందీప్, రవ్వల ప్రభాకర్, చోటు, మహేష్, మురళి, నాగపురి రమేష్, అల్లపు సాయి తదితరులు పాల్గొన్నారు.

**భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు**

బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ రాజ్యసభ సభ్యులు, వద్దిరాజు రవిచంద్ర పుట్టినరోజు పురస్కరించుకొని రవిచంద్ర యూత్ వింగ్ సభ్యులు ఉదయం భద్రకాళి ఆలయంలో రవిచంద్ర గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అనంతరం అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలతో పాటు వేద ఆశీర్వచనం అందించారు.

# 26న పల్లెల్లో ప్రత్యేక గ్రామ సభలు

– 'మేరా గావ్ – మేరీ ధరోహర్'లో భాగంగా దేశవ్యాప్తంగా నిర్వహణ

**వేద న్యూస్, కారేపల్లి:**



గణతంత్ర దినోత్సవం సందర్భంగా పల్లెలు సరికొత్త శోభను సంతరించుకోనున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మేరా గావ్ – మేరీ ధరోహర్' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 26న దేశవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలను నిర్వహించనున్నారు. ప్రతి గ్రామానికి ఉన్న చరిత్ర, సంస్కృతి, కళా వైభవాన్ని గుర్తించి ప్రపంచానికి చాటిచెప్పడమే ఈ గ్రామ సభల ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ప్రతి గ్రామానికి ప్రత్యేక చరిత్ర, సంస్కృతి, ప్రాచీన వృత్తులు, విశిష్ట వ్యక్తులు ఉన్నారని, ఆధునిక కాలంలో కనుమరుగవుతున్న ఈ వారసత్వాన్ని కాపాడుకోవడమే ఈ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామంలోని చారిత్రక కట్టడాలు, దేవాలయాలు, జానపద కళలు, స్థానిక కళాకారుల వివరాలను నమోదు చేసి భవిష్యత్ తరాలకు భద్రపరచనున్నారు. గ్రామ వారసత్వాన్ని కాపాడుతూనే భవిష్యత్ అభివృద్ధిపై చర్చించే వేదికగా ఈ సభలు నిలవనున్నాయని తెలిపారు. ప్రతి గ్రామానికి సంబంధించిన సమాచారాన్ని ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌లో భద్రపరుస్తారని, ఊరి పెద్దలు, యువత, మహిళా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని తమ గ్రామ ప్రత్యేకతలను వివరించాలని పిలుపునిచ్చారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం ఈ గ్రామ సభలు జరగనున్నందున, పౌరుల్లో దేశభక్తితో పాటు గ్రామభక్తి కూడా పెంపొందుతుందని అధికారులు పేర్కొన్నారు.

# 'ఎల్లంపల్లి' నుంచి గోదావరి జలాలు విడుదల

**వేద న్యూస్, బోయినిపల్లి:**



చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం కృషితో ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌కు గోదావరి జలాలు విడుదలయ్యాయి. యాసంగి పంటల సాగును దృష్టిలో ఉంచుకుని రైతులు ఇబ్బందులు పడకుండా ఈ చర్య తీసుకున్నట్లు తెలిపారు. సాగునీటి లభ్యతతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల కార్యదర్శి, రజక హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు అలవాల ధర్మయ్య మాట్లాడుతూ, రైతుల కోసం నీటిని విడుదల చేయించినందుకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గారికి కృతజ్ఞతలు తెలిపారు.

# మట్టి దొంగలు!

- కారేపల్లి మండలంలో రెచ్చిపోతున్న మట్టి మాఫియా
- నిబంధనలకు విరుద్ధంగా తరలింపు – పట్టించుకోని అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



**వేద న్యూస్, కారేపల్లి:**

కారేపల్లి మండల వ్యాప్తంగా మట్టి మాఫియా మేమే అన్నట్లు కొంతమంది దర్జాగా అక్రమ మట్టి దందా కొనసాగిస్తున్నారు. ఏమైనా ప్రశ్నిస్తే రాజకీయ ప్రముఖుల పేర్లు చెబుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అధికారులు సైతం అటువైపు వెళ్లేందుకు ధైర్యం చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సింగరేణి మండల పరిధిలోని గుట్ట కింద గుంపు గ్రామం వద్ద రైతుల పంట ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం తొమ్మిది కోట్ల రూపాయల వ్యయంతో 15 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాము నిర్మాణానికి ఇటీవల పనులు ప్రారంభించింది. ఈ గోదాము నిర్మాణానికి గుట్టలను చదును చేసేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అయితే ఈ అనుమతులనే అడ్డం పెట్టుకుని కొందరు మట్టి మాఫియా గుట్టలు చదును చేసిన తర్వాత వచ్చే మట్టిని గోదాము పనులకు ఉపయోగించాల్సిన బదులు, అధికార పార్టీ అండతో అక్రమంగా తరలిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతిరోజూ వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మండలంలోని వివిధ గ్రామాలకు ఇంటి అవసరాల పేరుతో మట్టిని తరలిస్తూ ఒక్కో ట్రాక్టర్‌కు తొమ్మిది వందల నుంచి వెయ్యి రూపాయల వరకు వసూలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

**నిబంధనలకు విరుద్ధంగా..**

అనుమతుల పేరిట మట్టి తవ్వకాలు జరుగుతున్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మట్టి తరలింపు జరుగుతుండడంపై స్థానికుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, అధికారుల నిర్లక్ష్యమే మట్టి మాఫియాకు బలం చేకూర్చుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి

స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మట్టి తరలిస్తున్న విషయం అధికారులకు తెలిసినా, రాజకీయ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆరోపిస్తున్నారు.

**పట్టించుకోని అధికారులు**

ఈ మట్టి మాఫియా దందా గత కొన్ని రోజులుగా నిర్భయంగా కొనసాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల వారి తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఇలాగే కొనసాగితే ప్రజా ఆస్తులు పూర్తిగా దోచుకు పోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మట్టి మాఫియాకు అడ్డుకట్ట వేయాలని, అక్రమ మట్టి తరలింపుపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**అడ్డుకట్ట వేస్తాం.. –తహసీల్దార్ ఏ. రమేష్**

ఈ విషయంపై కారేపల్లి మండల తహసీల్దార్ ఏ. రమేష్ స్పందిస్తూ, అక్రమ మట్టి తోలకాలకు కచ్చితంగా అడ్డుకట్ట వేస్తామని స్పష్టం చేశారు. మట్టి తరలింపుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, అభివృద్ధి పనుల పేరిట అక్రమ మట్టి మాఫియా దందా కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

**వేద న్యూస్, మహబూబాబాద్ :**




రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ ముఖ్య నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ హాజరయ్యారు. అలాగే మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయూబ్ , మహబూబాబాద్ డిసిసి అధ్యక్షురాలు భుక్యా ఉమా మురళి, మాజీ డీసీసీ భరత్ చంద్ర రెడ్డి తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి వార్డులో కాంగ్రెస్ పార్టీ బలంగా పోటీ చేయాలని, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సమస్యలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని, బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

# రోజ్గార్ మేళాతో పారదర్శక నియామకాలు

ఒక్కరోజే అరవై ఒక వేల నియామక పత్రాలను పంపిణీ చేసిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదని ఆయన అన్నారు. ఈ నియామక ప్రక్రియ పూర్తిగా ప్రతిభ ఆధారితంగా, లీకుల్లేని విధానంలో జరుగుతోందని స్పష్టం చేశారు. దీనికి సంపూర్ణ కీర్తి ప్రధాని నరేంద్ర మోదీకే దక్కుతుందని అన్నారు. హైదరాబాద్‌లోని హకీంపేటలో నిర్వహించిన రోజ్గార్ మేళా కార్యక్రమంలో బండి సంజయ్ పాల్గొని అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. నిరుద్యోగం అనేది కేవలం గణాంకం మాత్రమే కాదని, అనేక కుటుంబాలు ప్రత్యక్షంగా ఎదుర్కొంటున్న కష్టమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వాస్తవాన్ని ప్రధాని మోదీ బాగా అర్థం చేసుకున్నారని, అందుకే స్పష్టమైన ఉద్యోగ క్యాలెండర్‌తో నిరంతరంగా, పారదర్శకంగా నియామకాలు చేపడుతున్నారని బండి సంజయ్ తెలిపారు. యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రానున్న రోజుల్లో మరిన్ని ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పోటీ

**వేద న్యూస్, ఖమ్మం:**

రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందని పార్టీ ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ మిరియాల రామకృష్ణ స్పష్టం చేశారు. ఖమ్మం బైపాస్ రోడ్డులోని కృష్ణా ఫంక్షన్ హాల్‌లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా మిరియాల రామకృష్ణ మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలకు జనసేన గట్టి పోటీ ఇస్తుందని తెలిపారు. ప్రజల్లో నమ్మకం కలిగిన, నిబద్ధతతో పనిచేసే నాయకులకే పార్టీ టికెట్లు ఇస్తామని స్పష్టం చేశారు. పార్టీ మారుతూ పదేళ్లపాటు పదవులు అనుభవించి, కోట్ల రూపాయలు ఖర్చు చేసి టికెట్లు కొనుగోలు చేసే రాజకీయ సంస్కృతి మారాల్సిన అవసరం ఉందని విమర్శించారు. జంపు జిలానీ నేతలను కాకుండా నిబద్ధత గల యువతను రాజకీయాల్లోకి తీసుకురావాలన్నదే జనసేన లక్ష్యమని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజా సమస్యలపై స్పష్టమైన దృక్పథంతో పోటీ చేస్తామని, పట్టణాల అభివృద్ధి, పారదర్శక పాలన కోసం జనసేన కట్టుబడి ఉందని తెలిపారు. రాబోయే కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో జనసేన పార్టీ ప్రభావవంతమైన శక్తిగా అవతరిస్తుందని మిరియాల రామకృష్ణ ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేయూ సౌత్ జోన్ మహిళా క్రికెట్ జట్టు ఎంపిక

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



జనవరి 26 నుంచి ఫిబ్రవరి 2 వరకు చెన్నైలోని అన్నా యూనివర్సిటీలో నిర్వహించనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ మహిళా క్రికెట్ పోటీలకు కేయూ సౌత్ జోన్ జట్టును ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య వై. వెంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జట్టులో వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయ వ్యాయామ కళాశాల నుంచి ఎస్. జ్యోతిర్మయి, కే. కావ్య, యూనివర్సిటీ కాలేజీ నుంచి బి. వెన్నెల నాయక్, ఖమ్మం విశ్వవిద్యాలయ వ్యాయామ కళాశాల నుంచి వి. సుజాత, హనంకొండ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ నుంచి ఎల్. ఝాన్సీ, టి. శ్యామల, మహబూబాబాద్ టీజీటీడబ్ల్యూఆర్ డీసీ నుంచి జి. మోహన్ శ్రీ, జే. అనుష, కొత్తగూడెం టీజీటిడబ్ల్యూ ఆర్ నుంచి ఎస్. తుష్మ రేఖ, డి. యసస్విని, ఖమ్మం డీఆర్ఎస్ కాలేజీ నుంచి ఎం. భవ్య శ్రీ, వై. రాధిక, హనంకొండ కాకతీయ గవర్నమెంట్ కాలేజీ నుంచి ఎం. నవ్య, హనంకొండ వాగ్దేవి డిగ్రీ కాలేజీ నుంచి వి. చైతన్య, వరంగల్ కిట్స్ కాలేజీ నుంచి ఎం. ధాత్రి శ్రీ ఉన్నట్లు తెలిపారు. జట్టుకు కోచ్‌గా కేశవ డిగ్రీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ మట్టెడ కుమారస్వామి, మేనేజర్‌గా హనంకొండ గీతాంజలి డిగ్రీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ మొహమ్మద్ అలీ వ్యవహరిస్తారని ఆచార్య వెంకయ్య వెల్లడించారు.

వేద న్యూస్
ఆదివారం జనవరి 25, 2026

# ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన..



- ప్రజా సమస్యలపై అధికారులకు అల్టిమేటం
- వైరా అభివృద్ధికి రాందాస్ హామీ
- నూతి సత్యనారాయణ గౌడ్‌తో కలిసి గడప గడపకూ ఎమ్మెల్యే

**వేద న్యూస్, కారేపల్లి:**

వైరా మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్‌తో కలిసి శనివారం వైరాలో ఆయన సుడిగాలి పర్యటన నిర్వహించారు. వార్డు వార్డునూ పర్యటిస్తూ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్న ఎమ్మెల్యేకు డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయని, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. స్వయంగా డ్రైనేజీ కాలువలు, అంతర్గత రహదారులను పరిశీలించిన ఆయన, అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసి తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందడమే ఇందిరమ్మ రాజ్య లక్ష్యమని, రాజకీయాలకు అతీతంగా వైరా అభివృద్ధికి అండగా ఉంటా మన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ కార్యకర్తలతో సమావేశమైన నాయకులు ఎన్నికల వ్యూహంపై చర్చించారు. జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఈ పర్యటనలో స్థానిక కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాకతో తమ సమస్యలు త్వరలో తీరుతాయని వైరా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి
- నూతన సర్పంచులతో సమీక్ష సమావేశం



**వేద న్యూస్, మంచిర్యాల:**

గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శనివారం చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలకు అందవలసిన మౌలిక సదుపాయాలపై సర్పంచులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తూ పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో చెన్నూరు మండలానికి చెందిన పలువురు సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి మంత్రి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, నూతన సర్పంచులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

**వేద న్యూస్, శాయంపేట:**




సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసిన పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సంబంధిత బాధితునికి శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ అందజేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శాయంపేట మండలం సూరంపేట గ్రామానికి చెందిన ఈరాబోయిన రాజేష్‌కు చెందిన మొబైల్ ఫోన్ కొన్ని రోజుల క్రితం పోయిన విషయం తెలుసుకున్న బాధితుడు శాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను ట్రాక్ చేసి, అది ఉన్న ప్రాంతాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఫోన్‌ను బాధితుని బంధువులకు తిరిగి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బాధితులు పోలీసుల సేవలు అమోఘమని కొనియాడుతూ సంతోషం వ్యక్తం చేశారు.

# ఘనంగా 'యువ మండల్ వికాస్ అభియాన్'

**వేద న్యూస్, చొప్పదండి:**




గ్రామీణ యువతను ఏకం చేసి వారిని అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా 'మై భారత్' కరీంనగర్ విభాగం మరియు నవతరం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, చొప్పదండి ఆధ్వర్యంలో యువ మండల్ వికాస్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐదు రోజుల వ్యవధిలో 50 గ్రామాల్లో నిర్వహిస్తూ గ్రామీణ యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎంపీడీఓ కార్యాలయంలో యువజన సంఘాల నాయకులకు ప్రత్యేక యూత్ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ డీవైఓ వెంకట రాంబాబు మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయిలో ఉన్న యువజన సంఘాలను బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇప్పటివరకు యువజన సంఘాలు లేని ప్రాంతాల్లో నూతన సంఘాలను ఏర్పాటు చేసి, వాటిని 'మై భారత్ కరీంనగర్' ఉమ్మడి కరీంనగర్ జిల్లా విభాగాలకు అనుసంధానం చేయనున్నట్లు పేర్కొన్నారు. దీని ద్వారా భవిష్యత్తులో మై భారత్ నిర్వహించే ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో గ్రామీణ యువత చురుగ్గా పాల్గొనే అవకాశం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆర్గనైజర్ చల్లా అనూష్, నవతరం యూత్ అధ్యక్షులు కల్లెం మనీష్ రెడ్డి, జాగిరి సాయి గణేష్, చల్లా అచ్యుత్, బుర్ర మనోహర్, రాజేందర్, కొత్తూరి రమేష్, కొత్తూరి సాగర్, మెట్పల్లి సాగర్, సంబోజి సాయి కుమార్, ఆకాశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

# పేకాట రాయుళ్ల అరెస్ట్

- నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం



**వేద న్యూస్, మెదక్:**

మెదక్ జిల్లా శంకరంపేట్-ఆర్ మండలం కాజాపూర్ అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న వారిపై టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలోని బృందం శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్ట్ అయిన వారు సంకాపూర్ తండా, నార్సింగి మండలానికి చెందిన పాల్త్య బద్రు నాయక్, పాల్త్య శంకర్ నాయక్, బానోతు ప్రకాష్, నేనావత్ అనిల్‌గా గుర్తించారు. నిందితుల వద్ద నుంచి రూ. 8,725 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదు, మొబైల్ ఫోన్లు మరియు నిందితులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఎస్ఐకి అప్పగించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. జూదం, పేకాట, బెట్టింగ్ వంటి అక్రమ కార్యకలాపాల వల్ల కుటుంబాలు నష్టపోతున్నాయని, యువత తప్పుదారులు ఎంచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

# మంత్రిని కలిసిన కోరంపల్లి సర్పంచ్, ఉప సర్పంచ్

**వేద న్యూస్, టేక్మాల్:**



మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని కోరంపల్లి గ్రామ నూతన కార్యవర్గం సర్పంచ్, ఉప సర్పంచ్ శనివారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను సంగారెడ్డిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, గ్రామ అభివృద్ధికి కృషి చేసి కోరంపల్లిని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న వినీత్ కుమార్, ఉప సర్పంచ్ నాగరాజు, వార్డు సభ్యులు కృష్ణ, కేశయ్య, పద్మ, వెంకటమ్మ, సత్యమ్మ, జిల్లా ఆర్టీఏ మెంబర్ మల్లారెడ్డి, గ్రామ సీనియర్ నాయకులు విట్టల్, కృష్ణమూర్తి, పరమేశ్వర్, దుర్గేష్, భూషణం, సాయిలు, యాదయ్య, కొమురయ్యతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కురుమలకు సీట్లు కేటాయించాలి

- జిల్లా కురుమ సంఘం డిమాండ్



**వేద న్యూస్, చొప్పదండి:**

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు కురుమలకు తగిన ప్రాధాన్యత ఇచ్చి సీట్లు కేటాయించాలని జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు కడారి అయిలన్న కురుమ, కురుమ సంఘం ట్రస్ట్ అధ్యక్షుడు చిగుర్ల శ్రీనివాస్ కురుమ డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ సమీపంలోని కురుమ సంఘం కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన వారు, కరీంనగర్ కార్పొరేషన్‌తో పాటు చొప్పదండి, హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో అన్ని రాజకీయ పార్టీల్లో ఉన్న కురుమలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గత సర్పంచ్ ఎన్నికల్లో కురుమలు ధైర్యంగా ముందుకు వచ్చి పోటీ చేసి, ఇతర వర్గాల ఆశీస్సులతో గెలుపొందిన ఉదాహరణలు ఉన్నాయని వారు గుర్తు చేశారు. నీతి, నిజాయితీలకు మారు పేరుగా ఉన్న కురుమలకు టికెట్లు కేటాయిస్తే తప్పకుండా విజయం సాధించి, పరిపాలనలోనూ నిజాయితీగా సేవ చేస్తారని అభిప్రాయపడ్డారు. అభ్యర్థుల ఎంపిక విషయంలో గెలిచే అవకాశాలు ఉన్న స్థానాల్లో కురుమలకు సీట్లు కేటాయించి, తగిన ప్రాధాన్యత ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలను వారు కోరారు.

# విద్యతోనే బాలికలకు బంగారు భవిష్యత్

- మెదక్ అదనపు ఎస్పీ మహేందర్
- ఘనంగా జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు



**వేద న్యూస్, మెదక్ జిల్లా:**

నేటి సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో ప్రతిభను చాటుతూ ముందంజలో ఉన్నారని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. విద్యార్థినులను ఉద్దేశించి అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. అన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే ప్రతిభతో పాటు ఆత్మవిశ్వాసం, నిరంతర కృషి, పట్టుదల ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్య అనేది బాలికలకు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, అది వారి భవిష్యత్తును మార్చే శక్తిని ఇస్తుందని అన్నారు. బాలికల రక్షణ, భద్రత అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించిన ఆయన, అన్యాయం జరిగినప్పుడు మౌనంగా ఉండకుండా ధైర్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో షీ టీమ్స్ నిరంతరం నిఘా ఉంచుతూ మహిళలు, బాలికల భద్రత కోసం పనిచేస్తున్నాయని, అవసరమైన సందర్భాల్లో వెంటనే 100 డయల్ చేయాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని హెచ్చరించారు. ఈ సందర్భంగా 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినుల తల్లిదండ్రులను సత్కరించారు. అలాగే నాటకాలు, క్విజ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. చివరగా బాలికల రక్షణ, విద్య, అభివృద్ధి కోసం ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ విజయ, డీడబ్ల్యూఓ హేమ భార్గవి, ప్రిన్సిపాల్ తార సింగ్, భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ శ్వేత, సీడీపీఓ వెంకటరమణమ్మ, ఐసీపీయస్ కోఆర్డినేటర్ రాహుల్, తల్లిదండ్రులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

**వేద న్యూస్, రుద్రూర్:**



నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా శనివారం రుద్రూర్ మండలం రాయకూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సాయన్న విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలి పారు. రోడ్డు భద్రత నిబంధ నలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ గంగారాం, తహసీల్దార్ తారా బాయి, ఎం పీడీఓ బాల గంగాధర్, ఎంఈఓ శ్రీనివాస్, పాఠశాల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మిరప చేలను పరిశీలించిన అధికారులు

**వేద న్యూస్, దామరచర్ల:**



దామరచర్ల మండలం నర్సాపురం గ్రామంలోని మిరప పొలాలను వ్యవసాయ అధికారి ఎం. ఋషేంద్రమని శనివారం పరిశీలించారు. మిరప తోటలో పై ముడత, కింది ముడతతో పాటు బూడిద తెగులు సోకినట్లు గుర్తించిన ఆయన, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. మిరప పంట వేసిన రైతులు మాత్రమే యూరియా బుకింగ్ చేసుకోవాలని, యాప్‌లో మిరప తోటగా నమోదు చేయాలని సూచించారు. అధిక యూరియా బస్తాల కోసం వరి రైతులు మిరప పంటగా తప్పుగా నమోదు చేయకూడదని స్పష్టం చేశారు. రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పార్వతి, గ్రామ సర్పంచ్ హట్యా, రైతులు సేవ, సైదా, లక్ష్మణ్, శివ, హట్య తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీల భద్రతే మా లక్ష్యం

- నూతన విధానాన్ని సవరించే వరకు పోరాటం
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి



**వేద న్యూస్, ఆదిలాబాద్ జిల్లా:**

ఉపాధి హామీ కూలీల హక్కులను హరించే విధంగా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన విధానం ఉపాధి రహిత చట్టంగా మారిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి తీవ్రంగా విమర్శించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుంటూ, కూలీల కనీస వేతనాల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. బోథ్ మండలం అందూర్ గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ సర్పంచ్ పెందుర్ పృథ్వీరాజ్ అధ్యక్షతన గ్రామ ప్రజలతో నిర్వహించిన మన్రేగా సంగ్రామ్ బచావో సమావేశంలో పసుల చంటి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా తీసుకువచ్చిన చట్టంలో 2047 వరకు మాత్రమే ఉపాధి కల్పిస్తామని పేర్కొనడం దుర్మార్గమని విమర్శించారు. కనీస వేతనాలను రాష్ట్రాలు నిర్ణయించే అధికారాన్ని తొలగించి కేంద్రమే నిర్ణయించాలన్న విధానం వల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని అన్నారు. ఇప్పటివరకు కనీస వేతనాల నిర్ణయంలో ద్రవ్యోల్బణాన్ని బట్టి నిర్ణయించే అధికారం రాష్ట్రాల వద్ద ఉందని, ఆ అధికారాన్ని నూతన చట్టంలో తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు. ఏ రాష్ట్రాలకు ఎన్ని నిధులు ఇవ్వాలన్నది కేంద్రమే నిర్ణయించుకునే విధానం వల్ల అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ నిధులు, ఇతర రాష్ట్రాలకు తక్కువ నిధులు కేటాయించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఉపాధి చట్టంలో మహాత్మా గాంధీ పేరును తొలగించినంత మాత్రాన ప్రజల గుండెల్లో నుంచి ఆయన ఆశయాలను, భావజాలాన్ని ఎవరూ చెరిపివేయలేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు, కుచులాపూర్ ఉపసర్పంచ్ సుద్దుల అరుణ్ రెడ్డి, ఆదివాసీ కాంగ్రెస్ మండల వైస్ చైర్మన్ ఉమేష్ జాదవ్, మండల సీనియర్ నాయకులు చౌహన్ దేవిదాస్, గ్రామ పటేల్, పలువురు వార్డు సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే భద్రత

- ప్రతి ప్రాణం విలువైనదే..
- అందరూ బాధ్యతగా వ్యవహరించాలి
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

పోలీసులు ఎంత అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ప్రజలు రోడ్లపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించినప్పుడే ప్రమాదాలు తగ్గుతాయని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. రాజన్న సిరిసిల్ల పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద జరిగిన రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ముఖ్య అతిథిగా హాజరై వాహనదారులకు, విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మనం నిబంధనలు పాటించినప్పటికీ ఎదుటివారి నిర్లక్ష్యం వల్ల కూడా ప్రమాదాలు జరిగే అవకాశముందని, అందువల్ల ప్రతి ఒక్కరూ అత్యంత బాధ్యతతో వాహనాలు నడపాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర డీజీపీలు రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రాణాల రక్షణ లక్ష్యంగా ప్రారంభించిన అరైవ్-అలైవ్ కార్యక్రమం రాష్ట్రంలోని ప్రతి గ్రామం, పట్టణం, కాలనీ వరకు ప్రజల్లో అవగాహన కల్పించేలా కొనసాగుతుందని తెలిపారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరిస్తే అనేక ప్రాణాలను కాపాడవచ్చని స్పష్టం చేశారు. అనంతరం వాహనాలకు రోడ్ సేఫ్టీ అవగాహన పోస్టర్లు అతికించి, అధికారులు, వాహనదారుల తో కలిసి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ కృష్ణ, ఆర్ఐ సురేష్, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ దిలీప్, పోలీసు సిబ్బంది, నేతాజీ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నియంత్రణకు సమన్వయంతో కృషి

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
- పాల్గొన్న అదనపు ఎస్పీ చంద్రయ్య



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలో డ్రగ్స్, మాదక ద్రవ్యాల నియంత్రణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి సంబంధిత అధికారులతో శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల వినియోగ నియంత్రణ, నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి వారికి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించేలా వైద్యారోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటవీ శాఖ అధికారులు తమ పరిధిలోని అటవీ భూములను క్రమం తప్పకుండా పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ వివిధ రకాల పోటీలు నిర్వహించాలని సూచించారు. అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ, గంజాయి నిర్మూలన కోసం విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, అదే సమయంలో డ్రగ్స్, గంజాయి వినియోగం వల్ల కలిగే నష్టాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, జిల్లా వైద్యాధికారి రజిత, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఎక్సైజ్ అధికారి శ్రీనివాసరావు, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు సన్మానం


**వేద న్యూస్, శాయంపేట:**



పుట్టిన రోజు వేడుకల కార్యక్రమం నిమిత్తం శాయంపేట మండల కేంద్రానికి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను మైలారం గ్రామ మాజీ సర్పంచ్ అరికిళ్ల ప్రసాద్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గతంలో సర్పంచిగా సేవలందించిన అరికిళ్ల ప్రసాద్‌ను ప్రవీణ్ కుమార్ అభినందించారు. ప్రజాసేవలో ఆయన చేసిన కృషిని ప్రశంసిస్తూ, రాబోయే కాలంలో మరిన్ని పదవులు చేపట్టి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. అలాగే రాజకీయాల్లోకి మరింత మంది యువత రావాలని పిలుపునిచ్చారు.

# సకాలంలో పన్నులు చెల్లించాలి

- పట్టణ అభివృద్ధికి సహకరించండి
- మున్సిపల్ కమిషనర్ రాజలింగు



**వేద న్యూస్, మందమర్రి:**

మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమ ఇంటి పన్నులు, నీటి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, వాణిజ్య పన్నులు తదితరాలను సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ తుంగ పిండి రాజలింగు పిలుపునిచ్చారు. శనివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ పురపాలక చట్టం-2019లోని సెక్షన్ 100(2) ప్రకారం పన్నులు ఆలస్యంగా చెల్లిస్తే ప్రతి నెల 2 శాతం వడ్డీతో పాటు వడ్డీపై వడ్డీ పడుతుందని తెలిపారు. దీనివల్ల ప్రజలపై అధిక ఆర్థిక భారం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. కావున మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరూ తమ ఆస్తి పన్నులు, నీటి చార్జీలు తదితర పన్నులను తమ వార్డు బిల్ కలెక్టర్ లేదా వార్డు అధికారుల వద్ద సకాలంలో చెల్లించి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. అలాగే పన్నులు చెల్లించని పక్షంలో తెలంగాణ పురపాలక చట్టం-2019లోని సెక్షన్ 87 ప్రకారం ఆస్తులను జప్తు చేసే చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

# రంజాన్ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య



**వేద న్యూస్, మంచిర్యాల:**

రంజాన్ పండుగను మత సామరస్యంతో, ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య పిలుపునిచ్చారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పండుగను సామరస్యంగా, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఇఫ్తార్ కార్యక్రమాలు, ప్రార్థనల నిర్వహణకు సంబంధిత శాఖల సమన్వయంతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రార్థన సమయాల్లో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. రంజాన్ మాసంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖతో సమన్వయం చేయాలని, మార్కెట్లు, మసీదుల సమీపంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మసీదులు, ప్రార్థనా మందిరాలు, ప్రజా ప్రదేశాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, అంతర్గత రహదారుల్లో సరైన లైటింగ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్‌లతో కలిసి మండలాల తహసిల్దారులు, మున్సిపల్ కమిషనర్లు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కురుమూర్తి దేవస్థానంలో షెడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన

**వేద న్యూస్, చిన్న చింతకుంట**

తెలంగాణ జిల్లాలో పేదల తిరుపతిగా విరజిల్లుతున్న కురుమూర్తిస్వామి దేవస్థానం పరిధిలో భక్తుల సౌకర్యార్థం చేపట్టనున్న షెడ్ల నిర్మాణానికి అధికారులు శనివారం స్థల పరిశీలన చేశారు. చిన్న చింతకుంట మండలం అమ్మపురం గ్రామ సమీపంలో ఏడుకొండల మధ్య కాంచన గుహలో స్వయంభుగా వెలసిన శ్రీ కురుమూర్తి స్వామి ఆలయం వద్ద రాజగోపురం ముందు రౌండ్ షెడ్ నిర్మాణం, అలాగే పాత ధర్మశాల కోనేరు సమీపంలో భక్తుల కోసం దాసంగాల షెడ్ నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ డీఈ లక్ష్మణ్ గౌడ్, ఏఈ, ఆలయ పాలకమండలి చైర్మన్ జి. గోవర్ధన్ రెడ్డి కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ జి. గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, ఈ రెండు షెడ్ల నిర్మాణానికి మూడో నిధుల కింద మంజూరు లభించినట్లు తెలిపారు. భక్తులకు త్వరలోనే మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఈ షెడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు భాస్కరాచారి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపూర్ రిజర్వాయర్‌కు గోదావరి జలాలు

- చొప్పదండి రైతులకు జనవరిలోనే సాగునీరు
- రైతులను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటాం
- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**వేద న్యూస్, గంగాధర:**

చొప్పదండి నియోజకవర్గంలోని రైతులకు చివరి మడివరకు సాగునీరు అందించి పంటలు కాపాడుతామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా ఇచ్చారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌కు శనివారం గోదావరి జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి రిజర్వాయర్ పంపుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గోదావరి జలాలకు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు కోరకముందే వారి అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని జనవరి నెలలోనే సాగునీటిని విడుదల చేయించినట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో పంటలకు నీళ్లు ఇవ్వాలని ధర్నాలు, రాస్తారోకోలు చేస్తే అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేశారని విమర్శించారు. మార్చి నెలకు ముందు నీటిని విడుదల చేసిన సందర్భాలు అప్పట్లో లేవని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముందస్తుగా సాగునీటి విడుదలకు చర్యలు తీసుకున్నామని అన్నారు. చొప్పదండి నియోజకవర్గాన్ని వాటర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని, నారాయణపూర్ రిజర్వాయర్ నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. ఇప్పటికే రూ. 23.50 కోట్లు మంజూరు కాగా, త్వరలో మరో రూ. 20 కోట్లు మంజూరు చేయించనున్నట్లు వెల్లడించారు. భూసేకరణ పనులను వేగవంతం చేసి నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తన అభ్యర్థన మేరకు నీటిని విడుదల చేయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ వెలిచాల తీర్మల్ రావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నాగేష్, పలువురు సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు

# 'ఉపాధి'కి గ్యారంటీ 'వికసిత్ భారత్ జి రాంజీ'

- ఎంపీ డీకే అరుణ

**వేద న్యూస్, చిన్న చింతకుంట:**

చిన్న చింతకుంట మండలం పర్దీపూర్ గ్రామంలో నిర్వహించిన వికసిత్ భారత్ జి రాంజీ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, దేవరకద్ర నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ కొండా ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణమ్మ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు లేక ప్రజలు పట్టణాలకు వలస వెళ్తున్నారని, అలా జరగకుండా గ్రామాల్లోనే ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ పథకం ద్వారా సంవత్సరానికి మొత్తం 125 రోజుల పాటు ప్రజలకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం చిన్న చింతకుంట గ్రామం నుంచి ఉంద్యాల గ్రామం వరకు నక్కల వంపు మార్గం మీద నిర్మించనున్న రహదారి బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న చింతకుంట మండల అధ్యక్షులు దశరథ, జిల్లా ఉపాధ్యక్షులు కురువ రమేష్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ పద్మజా రెడ్డి, బండ్రవల్లి సర్పంచ్ వెంకటేష్, పర్దీపూర్ సర్పంచ్ శివకుమార్, నరేష్, శ్రీనివాసులు, వెంకటేష్, బాలరాజు, గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

ఆదివారం జనవరి 25, 2026

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేడు ఉచిత వైద్య శిబిరం

**వేద న్యూస్, కాసిపేట:**



లయన్స్ క్లబ్ దేవాపూర్ ఓరియంట్ గోల్డ్ 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దేవాపూర్ పరిసర గ్రామాల ప్రజలు, అదానీ కంపెనీ ఉద్యోగులు, కార్మికులకు ఉపయోగపడే విధంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని నేడు అదానీ కంపెనీకి చెందిన లేడీస్ క్లబ్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరాన్ని లయన్స్ క్లబ్ దేవాపూర్ ఆధ్వర్యంలో ఫార్చ్యూన్ హాస్పిటల్‌కు చెందిన వైద్య బృందం నిర్వహించనుంది. శిబిరంలో ముఖ్యంగా గుండె సంబంధిత పరీక్షలు, మధుమేహం (షుగర్) పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు, కంపెనీ సిబ్బంది తమ ఆరోగ్య పరిస్థితిని ముందుగానే తెలుసుకునేందుకు ఇది మంచి అవకాశం అని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం చైర్‌పర్సన్ గోంది వెంకట రమణ మాట్లాడుతూ.. దేవాపూర్ పరిసర గ్రామాల ప్రజలు, కంపెనీ ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యంపై అవగాహన పెంచుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు

## సేఫ్ సిటీగా అభివృద్ధి చేయడమే లక్ష్యం

- 10 నిమిషాల అసౌకర్యానికి వందేళ్ల జీవితాన్ని నాశనం చేసుకోవద్దు
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**వేద న్యూస్, మహబూబ్‌నగర్:**



మహబూబ్‌నగర్ నగరంలోని గడియారం చౌరస్తా వద్ద ముడా నిధులతో ఏర్పాటు చేసిన 30 సీసీ కెమెరాలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్‌ను క్లియర్ సిటీ, సేఫ్ సిటీగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని, ప్రతి వాహనచోదకుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. 10 నిమిషాల అసౌకర్యానికి 100 ఏళ్ల జీవితాన్ని నాశనం చేసుకోవద్దు అంటూ ప్రజలకు హితవు పలికారు. గత రెండేళ్లుగా నగరంలో క్రైం రేట్ తగ్గిందని, డ్రగ్స్, మత్తు పదార్థాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బి. జానకి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి, పోలీసు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

- 18 గొర్రెల మృతి

**వేద న్యూస్, మందమర్రి:**



మందమర్రి జాతీయ రహదారిపై అందుగుల పేట గ్రామపంచాయతీ పరిధిలోని కోరేగట్టు ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మందమర్రి పట్టణ ఎస్సై జి. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల నుంచి మందమర్రి వైపు అతివేగంగా, మద్యం మత్తులో వచ్చిన ఖా22 ం 6939 నంబర్ గల లారీ రహదారి దాటుతున్న గొర్రెల గుంపును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నార్లాపూర్ గ్రామానికి చెందిన అర్కటి మొండి, అర్కటి సదానందం, చిట్టవేణి మల్లయ్యకు చెందిన మొత్తం 18 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 5 గొర్రెల కాళ్లు విరిగినట్లు ఎస్సై తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గాయపడిన గొర్రెలకు తక్షణమే చికిత్స అందించారు. అర్కటి మొండి ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ ఆకుల శంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

## డ్రైనేజీ మార్గం క్లియర్

**వేద న్యూస్, నెక్కొండ :**



బంజరుపల్లె గ్రామంలోనీ ఎస్సీ కాలనీలో డ్రైనేజీ పూర్తిగా పూడిక తో కూరుకుపోయింది గత రెండు సంవత్సరాలుగా డ్రైనేజీ లో వాటర్ స్టోరేజి అయి.. చుట్టుపక్కల ఇండ్లలోకి దుర్వాసన వస్తున్నది. ఈ విషయాన్ని ఒకటో వార్డు మెంబర్ ఒరే మహేశ్వరి రాజు.. సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లగా, పనుల పురోగతిని సమీక్షించి.. జెసిబి సహాయంతో డ్రైనేజీ సాఫ్ గా వెళ్ళేందుకు మార్గం క్లియర్ చేయించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర సుజాత రాజు, పార్టీ సీనియర్ నాయకులు తీర్నల వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, అనిల్ ,విక్రం ,పొన్నాల స్వామి కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులను కడుపులో పెట్టుకుంటాం

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**వేద న్యూస్, చొప్పదండి/గంగాధర:**



చొప్పదండి నియోజకవర్గంలోని రైతులకు చివరి మడి వరకు సాగునీరు అందించి పంటలు కాపాడుతా మని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నారాయణపూర్ రిజర్వాయర్‌కు శని వారం గోదావరి జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే, రైతులు కోరకముందే జనవరిలోనే సాగునీటిని విడుదల చేయించినట్లు చెప్పారు. గత బీఆర్‌ఎస్ పాలనలో మార్చికి ముందే నీళ్లు విడుదల చేసిన సందర్భం లేదని విమర్శించారు. చొప్పదండిని వాటర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని, నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందిస్తామని తెలిపారు. ఇప్పటికే రూ.23.50 కోట్లు మంజూరు కాగా, త్వరలో మరో రూ.20 కోట్లు మంజూరు చేయించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం

- సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, కురుమూర్తి దేవస్థానం చైర్మన్ జి. గోవర్ధన్ రెడ్డి

**వేద న్యూస్, కౌకుంట్ల:**



గ్రామంలో ప్రతి ఒక్కరి సహకారంతో ముచ్చింతల గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలని గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, కురుమూర్తి దేవస్థానం పాలకమండలి చైర్మన్ జి. గోవర్ధన్ రెడ్డి, ఉప సర్పంచ్ గద్దె నితిన్ కుమార్ పిలుపునిచ్చారు. కౌకుంట్ల మండల పరిధిలోని ముచ్చింతల గ్రామంలో శనివారం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. గ్రామంలో ముఖ్యంగా మంచినీటి సరఫరా మెరుగుదల, ప్రతి వీధిలో మురుగు కాల్వల నిర్మాణం, అంతర్గత రహదారుల అభివృద్ధి, వీధి దీపాలు, ఐమాక్స్ లైట్ల ఏర్పాటును వేగవంతంగా చేపడు తున్నామని తెలిపారు. గ్రామంలోని సమస్యల పరిష్కారం కోసం గ్రామపంచాయతీ కార్యాలయంలో చర్చించి తీర్మానాలు చేసుకొని అభివృద్ధి పనులు చేపడ దామని అన్నారు. గ్రామంలోని రామ మందిరం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం, అలాగే శివాలయం అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాజకీయాలకు పునాది యూత్ కాంగ్రెస్

- పార్టీ బలోపేతానికి యువత ముందుండాలి
- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వేద న్యూస్, వనపర్తి:**

యూత్ కాంగ్రెస్ నుంచే పటిష్ట రాజకీయ నాయకులు తయారవుతారని, రాజకీయాలకు యూత్ కాంగ్రెస్ పునాదిలాంటిదని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం వనపర్తి పట్టణంలోని ఎంవైఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జిల్లా యూత్ కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువకులు అనుకుంటే దేనినైనా సాధించగలరని, ప్రతి యువకుడు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో బీఆర్‌ఎస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారాలను యూత్ కాంగ్రెస్ యువకులు చురుగ్గా ఖండించాలని పిలుపునిచ్చారు. భావి భారత ప్రధానిగా రాహుల్ గాంధీని చేసే వరకు యువత నిర్విరామంగా కృషి చేయాలని అన్నారు. ఇటీవల గ్రామపంచాయతీ ఎన్నికల్లో వనపర్తి నియోజకవర్గంలో 40 మందికి పైగా యువకులు సర్పంచులుగా గెలవడం కాంగ్రెస్ పార్టీ యువతకు ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామాల్లో రైతు కూలీలతో మమేకమై సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని, నెలకు కనీసం ఒక యూత్ సమావేశం నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు వాకిటి ఆదిత్య, వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్లోకి వలసలు

- సుమారు 200 మంది నాయకులు చేరిక
- గత ప్రభుత్వాలు చేయలేనివి రెండేళ్లలో చేశాం
- ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

**వేద న్యూస్, మంచిర్యాల:**



మంచిర్యాల పట్టణ అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై బీఆర్‌ఎస్‌కు చెందిన సుమారు 200 మంది నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు కాంగ్రెస్‌లో చేరగా, ఎమ్మెల్యే పీఎస్‌ఆర్ వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా మంచిర్యాలలో అండర్‌గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ సిస్టమ్‌ను త్వరలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గత 75 ఏళ్లలో ఏ ఎమ్మెల్యే చేయని అభివృద్ధిని తాను చేశానని అన్నారు. సింగరేణి భూముల్లో నివసిస్తున్న కార్మిక కుటుంబాలకు రెండు నెలల్లో శాశ్వత ఇళ్ల పట్టాలు అందిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని 282 పాఠశాలల్లో విద్యా వ్యవస్థను ఆధునికీకరిస్తున్నామని, కార్పొరేట్ స్థాయి సదుపాయాల కోసం రూ.150 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామని తెలిపారు. మంచిర్యాల ఐబీ చౌరస్తా వద్ద 600 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం శరవేగంగా సాగుతోందని చెప్పారు. దండేపల్లి, లక్షెట్టిపేట్ మండలాల్లో నాలుగు మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను రూ.74.40 కోట్లతో త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రంలోనే ఎక్కువగా మంచిర్యాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 60 సీట్లు సాధించి కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధరణి అక్రమాలన్నీ త్వరలో బయటపెడతాం

- సిద్దిపేట, సిరిసిల్లలో ఫోరెన్సిక్ ఆడిట్‌తో అక్రమాల గుర్తింపు
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్
- ధరణి లోసుగుల వల్లే రిజిస్ట్రేషన్ అవకతవకలు
- మంత్రి పొంగులేటి సంచలన ప్రకటన



**వేద న్యూస్ హైదరాబాద్ :**

ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని జరిగిన అక్రమాలన్నింటినీ త్వరలోనే ప్రజల ముందు ఉంచుతామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి పోర్టల్‌లోని లోసుగులను ఆసరాగా చేసుకొని ప్రభుత్వ భూములను కాజేసిన వారిని, రిజిస్ట్రేషన్ చలానా సొమ్మును దారి మళ్లించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌ను కుట్రపూరితంగా ప్రవేశపెట్టడం వల్లే అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని మంత్రి విమర్శించారు. దీనిపై సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థ ద్వారా పైలట్ ప్రాజెక్ట్ కింద ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించామని తెలిపారు. ఈ ఆడిట్‌లో అనేక అవినీతి వ్యవహారాలు జరిగినట్లు ప్రాథమిక నివేదికలో స్పష్టమైందని చెప్పారు. ఈ నివేదిక ఆధారంగా మిగిలిన 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్ చేపడతామని ప్రకటించారు. ఈరోజు డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ధరణి పోర్టల్ అక్రమాలపై ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీతో మంత్రి పొంగులేటి సమావేశం నిర్వహించారు. విచారణలో ఎదురైన అంశాలు, ఎవరి పాత్ర ఎంత, తెర వెనుక ఎవరైనా ఉన్నారా, రెవెన్యూ అధికారుల పాత్ర ఉందా వంటి అంశాలపై కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక నివేదికను పరిశీలించిన అనంతరం మరింత లోతైన విచారణ జరిపి తుది నివేదిక సమర్పించాలని కమిటీకి సూచించారు. ధరణి పోర్టల్ ప్రారంభమైన తర్వాత మొత్తం 52 లక్షల లావాదేవీల్లో 35 లక్షల లావాదేవీలను పరిశీలించగా, ప్రాథమికంగా 4,848 లావాదేవీల్లో లోటుపాట్లు గుర్తించినట్లు తెలిపారు. విచారణ అనంతరం 1,109 డాక్యుమెంట్లకు సంబంధించిన సుమారు నాలుగు కోట్ల రూపాయలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందని కమిటీ సభ్యులు వెల్లడించినట్లు చెప్పారు. ఇప్పటివరకు తొమ్మిది జిల్లాల్లోని 35 మండలాల్లో అక్రమాలకు పాల్పడిన 48 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు మంత్రి వివరించారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉండగా, ప్రతిపక్ష నేతలు ఎవరో వెయ్యి కోట్లు, మరెవరో పది వేల కోట్ల అవినీతి అంటూ ఆధారాలు లేకుండా మాట్లాడుతున్నారని పొంగులేటి తీవ్రంగా విమర్శించారు. ఇదిలా ఉండగా, జనవరి 25న ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో శిక్షణ పొందిన మరో రెండు వేల మంది సర్వేయర్లకు లైసెన్సులు అందజేస్తామని తెలిపారు. ఇప్పటికే మొదటి విడతలో నాలుగు వేల మందికి లైసెన్సులు జారీ చేసినట్లు పేర్కొంటూ, ఈ లైసెన్స్‌డ్ సర్వేయర్లతో రాష్ట్రంలోని నక్షా లేని 373 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073